మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- ఆసరా ద్వారా రూ.10.74 కోట్ల రుణ మాఫీ నిధుల విడుదల
- జోన్-3 పరిధిలో 1309 సంఘాలకు లబ్ధి



లబ్ధిదారులకు ఆసరా రుణామాఫీ నిధుల చెక్కును అందజేస్తున్న అక్కరమాని, తదితరులు



నవరత్నాల రంగోళి వద్ద అక్కరమాని, లబ్ధిదారులు, పార్టీ మహిళా నాయకులు

ఎంవీపీ కాలనీ: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం వేదికగా గురువారం మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. డ్వాక్రా రుణమాఫీలో భాగంగా రూ.10,74,49,000 వైఎస్సార్ ఆసరా నిధులను ఆమె విడుదల చేశారు.

ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ మహిళల ఆర్థిక భరోసా, సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అన్నింటా మహిళలకు ప్రాధాన్యమిస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున రుణామాఫీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 2 విడతల రుణామాఫీ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ తాజాగా 3వ విడత నిధులు విడుదల చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక యజ్ఞంలా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను మోసం చేశారన్నారు. రాష్ట్ర ప్రజల సర్వముఖాభి వృద్ధికి కృషి చేయడం ద్వారా మహానేత వైఎస్సార్ మాదిరిగా ప్రజల్లో గుండెల్లో నిలిపోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్ష అని చెప్పారు. నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే జగన్‌కు రాష్ట్ర ప్రజలు అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. జోన్-3 పరిధిలో 1309 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, 3వ విడత ద్వారా ఆయా సంఘాలకు రూ.10,74,49,000 నిధులు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, జెడ్పీ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు గేదెల లావణ్య, మువ్వల లక్ష్మి, అప్పారి శ్రీవిద్య, గుడ్ల విజయసాయి, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, పీతల గోవింద్, గుడ్ల సత్యారెడ్డి, సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

సందడిగా 'వైఎస్సార్ వ్యూ పాయింట్'



వైఎస్సార్ వ్యూ పాయింట్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు

ఆరిలోవ: బీచ్ రోడ్డులో సీతకొండ మలుపు వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్సార్ వ్యూ పాయింట్ కళకళలాడుతోంది. నగరంలో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా ఇక్కడ సీవ్యూ పాయింట్‌ను జీవీఎంసీ అధికారులు అభివృద్ధి చేయడం తెలిసిందే. ఈ పాయింట్ సాయంత్రం వేళ సందడిగా ఉంటోంది. గతంలో దీన్ని సీతకొండ వ్యూ పాయింట్ అని పిలిచేవారు. ఇటీవల అభివృద్ధి చేసిన అనంతరం వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు. సందర్శకులు, వాహన చోదకులు ఇక్కడ ఆగి తీరం అందాలు తిలకిస్తున్నారు. అధికారులు ఇక్కడ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు వద్ద ఫొటోలు తీసుకుని ముచ్చట పడుతున్నారు. సాయంత్రం వాకింగ్ చేస్తున్న వారు కూడా ఇక్కడ నిర్మించిన రక్షణ గోడపై కొంతసేపు సేదదీరుతున్నారు. ఓ పక్క ఎగసిపడుతున్న సముద్ర కెరటాలు, మరో పక్క కొండవాలులో బండరాళ్లపై వేసిన రంగుల పెయింటింగ్ ఆకట్టుకుంటున్నాయి.

న్యాయశాస్త్రంలో పరిశోధనపై వర్క్‌షాప్



మార్గరేట్‌ను సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర పరిశోధనలపై గురువారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పరిశోధకురాలు ప్రొఫెసర్ మార్గరేట్ ఫిలిప్స్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రపంచం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తున్నా వివిధ దేశాల్లో ఇప్పటికీ తమకు జరిగిన అన్యాయాలను న్యాయ స్థానాల దృష్టికి తీసుకెళ్లాలన్న అవగాహన ప్రజల్లో లేకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు, ప్రొఫెసర్ బి.నళిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన రక్షణగిరి



ముస్తాబవుతున్న జ్ఞానాపురం రక్షణగిరి

కంచరపాలెం: జ్ఞానాపురం రక్షణగిరిలో ఈ నెల 7 శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సెయింట్ పీటర్స్ పునీత పేతురు దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ డాక్టర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖ అర్చి బిషప్ (అతిమేత్రానులు) ఫాదర్ మల్లావరపు ప్రకాశ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. రెవరెండ్ ఫాదర్ల నేతృత్వంలో శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి శిలువ మార్గం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేయనున్నట్లు ఫాదర్ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి రక్షణగిరి వరకు నిర్వహించే శిలువ మార్గ ప్రార్థనల్లో క్రైస్తవ భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పోలమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ. 8.46 లక్షలు

(క్లుప్తంగా)



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉద్యోగులు

ఏయూక్యాంపస్: పోలమాంబ ఆలయ వార్షిక జాతర అనంతరం హుండీల లెక్కింపు గురువారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లెక్కింపు చేపట్టగా.. 17 రోజులకు రూ. 8,46,145 ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పసన్న లక్ష్మి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, పోలీసు శాఖ, యూబీఐ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు.

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: రుషి గాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే 14 రోజుల ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. లాసన్స్‌బే కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 9న సాయంత్రం 6 గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. 20 మందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తామని, ఆసక్తి కలిగిన వారు 94403 95439, 77801 54103 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

10న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మధురవాడ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న మధురవాడలోని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్‌ఎఫ్ చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు హాజరయ్యే ఈ సదస్సులో జోన్-3 పరిధిలోని మధురవాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్ డివిజన్ల పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు విన్నవించుకోవచ్చునని తెలిపారు.

దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వస్తు ప్రదర్శన



దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం వస్తు ప్రదర్శన, విక్రయాలు నిర్వహించారు. నగరంలో సెయింట్ జోసఫ్ కాలేజీ ఫర్ ఉమెన్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడు నెలల పాటు బ్లాక్, స్క్రీన్ ప్రింటింగ్‌లలో శిక్షణ పొందారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ మేరకు విద్యార్థులు ఇక్కడ శిక్షణ కాలంలో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి, విక్రయాలు చేపట్టారు. ఈ ప్రదర్శనను దయాల్‌బాగ్ రాధాస్వామి సత్సంగ్ ఆంధ్రా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ వి.వి.జి.శాస్త్రి ప్రారంభించారు. ఇక్కడ సుమారు రూ.20వేలు విలువైన వస్తువులను ప్రదర్శించగా.. రూ.18 వేలు విలువైన వస్తువులు విక్రయించినట్లు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ కాలేజీ అధ్యాపకులు, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైవేపై కారును ఢీకొట్టిన లారీ



డివైడర్‌పైకి ఎక్కిన కారు

మర్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం తాటిచెట్లపాలెం నుంచి ఎన్‌ఏడీ వైపు వెళ్తున్న కారును.. లారీ ఢీకొట్టింది. ఎన్ఏడీ వైపు తమ బంధువుల ఇంటికి వెళ్తున్న పోతల సత్యనారాయణ కారును అదే దారిలో వెనుక వస్తున్న లారీ అధిగమించే క్రమంలో కారు పక్క భాగాన్ని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌పైకి వెళ్లిపోయింది. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కారులో ఎవరెవరున్నారు అనే వాటిపై పూర్తి వివరాలు తెలియరాలేదు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాసాకు శ్రీచైతన్య విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక



విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమణి, తదితరులు

ఎంవీపీ కాలనీ: నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలో శ్రీచైతన్య పాఠశాల ఎంవీపీ కాలనీ బ్రాంచి విద్యార్థి వితనాల విష్ణువర్ధన్ ప్రాజెక్టు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమణి తెలిపారు. ప్రపంచంలోని 30 దేశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్టులను నాసాకు పంపగా.. అందులో 89 ప్రాజెక్టులు ఇండియా నుంచి ఎంపికయ్యాయన్నారు. అందులో పలు ప్రాజెక్టులు శ్రీచైతన్య విద్యార్థులకు చెందినవి ఉండగా.. వాటిలో ఎంవీపీ బ్రాంచికి చెందిన విష్ణువర్ధన్ రూపొందించిన 'నవగ్రహ' ప్రాజెక్టు ఒకటన్నారు. విద్యార్థికి నాసా వ్యక్తిగత బహుమతి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

జాన్‌వెస్లీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు



జాన్ వెస్లీని సత్కరిస్తున్న గేదెల నాగరాజు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, తూర్పు యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ సత్కరించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జాన్‌వెస్లీని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

యువతి అదృశ్యం



లలితాదేవి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఐటీఐ జంక్షన్ వద్ద తుమ్మడిపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న లలితాదేవి అనే యువతి ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 4న ఓ రోగికి ఫిజియోథెరపీ చేయాలని ఇంటి నుంచి వెళ్లి తిరిగి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు పలు చోట్ల గాలించారు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం సాయంత్రం యువతి తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా కనిపిస్తే స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో మాధవ్, తదితరులు

ఎంవీపీ కాలనీ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్.. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో అవినీతిని అంతమొందించడానికి బీజేపీ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ వరకు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆరిలోవ: స్థానిక నెహ్రూనగర్‌లో గురువారం ఉపకార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచెర్ల అచ్యుతరావు ప్రారంభించారు. పిల్లలు, వృద్ధులకు మజ్జిగ, తాగునీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పారిపల్లి రామారావు, వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో చైత్ర మాసం పౌర్ణిమ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవుడికి ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించారు. సేవా దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. ఉదయం 8.30 గంటలకు భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 10.30 గంటలకు శ్రీవారిని అలంకరించి అర్చన చేశారు. దాతలను శ్రీవారి శాలువా, కండువాతో ఆలయ అర్చకుడు వాసుదేవచార్యులు సత్కరించారు.

ఏయూ సమాచారమ్

రిజిస్ట్రార్‌కు అభినందనలు



రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా మరో పర్యాయం బాధ్యతలు చేపట్టిన ఆచార్య వి.కృష్ణమోహన్‌ను వర్సిటీ ఆచార్యులు అభినందించారు. ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం. పవార్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు గురువారం రిజిస్ట్రార్ కార్యాలయంలో కృష్ణమోహన్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను రెక్టార్ ఆచార్య కె.సమత గురువారం పరిశీలించారు. భౌతిక శాస్త్ర విభాగంలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పటిష్టంగా పరీక్షలు నిర్వహించడంపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రాలలో వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆహ్లాదంగా.. ఆకర్షణీయంగా..

- రూ.2.61 కోట్లతో లుంబినీ పార్కు ఆధునికీకరణ
- పెరుగుతున్న సందర్శకుల తాకిడి



పార్కులోని చిల్డ్రన్ ప్లే ఏరియా



ఆహ్లాదాన్ని పంచుతున్న పూల వనం



ఆకర్షణీయంగా పార్కులోని బుద్ధుడి విగ్రహం, స్థూపాలు

ఎంవీపీ కాలనీ: అప్పుఘర్‌లో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న లుంబినీ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగింది. రూ.కోట్లు వ్యయంతో జీవీఎంసీ అత్యంత ఆకర్షణీయంగా ఈ పార్కును అభివృద్ధి చేసింది. అయితే తొలినాళ్లలో అంతంతమాత్రంగా ఉన్న సందర్శకుల తాకిడి ప్రస్తుతం వేగం పుంజుకుంది. పార్కులో ఉన్న ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించేందుకు సాయంత్రం పూట సందర్శకులు, స్థానికులు పెద్ద ఎత్తున ఈ పార్కుకు తరలివస్తున్నారు. 2017లో ఈ పార్కు ఆధునికీకరణ పనులు ప్రారంభం కాగా.. దశలవారీగా పూర్తి చేశారు.

పార్కు అభివృద్ధి ఇలా..

మూడెకరాల విస్తీర్ణంలో ఈ పార్కును రూ.2.61 కోట్లతో అభివృద్ధి చేశారు. తొలి విడతగా రూ.56.80 లక్షలతోను, రెండో విడతగా 1.60 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. తొలి విడతలో భాగంగా ఓపెన్ జిమ్, సీటింగ్, ఫ్రంట్ గ్రిల్, బ్యాక్ సైడ్ గ్రిల్, టికెట్ కౌంటర్, సెక్యూరిటీ రూమ్‌లు, బుద్ధుడి విగ్రహం సర్కిల్ అభివృద్ధి చేయగా.. 2వ విడతలో గ్రానైట్ వర్క్, చిల్డ్రన్ ప్లే ఏరియా, బుద్ధుడి విగ్రహం, బాల బుద్ధాస్, పిల్లర్లను అభివృద్ధి చేశారు. దీంతో పాటు ఫౌంటెన్, ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్, రిటర్నింగ్ వాల్, క్యాంటీన్, ట్రాన్స్ గేట్, లాంగ్ స్కేపింగ్, క్రీడా వింగ్‌లు అభివృద్ధి చేశారు. దీంతో పాటు రూ.16 లక్షలతో పార్కులో వినూత్న మొక్కలతో కూడిన గ్రీనరీని తీర్చిదిద్దారు.

పెరుగుతున్న ఫొటో షూట్‌లు

ప్రస్తుతం బుద్ధిడి విగ్రహ ప్రాంగణంతో పాటు పూలవనాలు, చిల్డ్రన్ ప్లే ఏరియాలు సందర్శకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. గ్రీన్ కార్పొరేషన్ పూలవనాల ఏర్పాటులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ప్రస్తుతం అవి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీంతో పాటు వెడ్డింగ్, బర్త్‌డే ఫొటోషూట్‌ల కోసం పెద్ద ఎత్తున నగరవాసులు ఈ పార్కుకు వస్తున్నారు. పూల వనాలలో, బీచ్ వ్యూలతో ఫొటో షూట్‌లు చేసుకుంటున్నారు. ఓపెన్ క్యాంటీన్ ఏరియా, బీచ్‌ను ఆనుకుని వున్న ఏరియాల్లో ఏర్పాట్లు చేసిన బెంచీల్లో సందర్శకులు పెద్ద ఎత్తున సేద తీరుతున్నారు.



ఆధునిక పరికరాలతో కూడిన వ్యాయామ ప్రాంగణం